సరైన పత్రాలు లేని టేబుల్ ఫ్యాన్లు స్వాధీనం

నాంపల్లి: హైదరాబాద్ నుంచి హుబ్లీకి తరలిస్తున్న సరైన పత్రాలు లేని 826 టేబుల్ ఫ్యాన్లను జీఆర్పీ పోలీసులు సీజ్ చేశారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా నాంపల్లి రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేశారు. బుధవారం ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో కానిస్టేబుల్స్ శ్రీనివాస్, సాయి, కోటేశ్వరరావు, షకీల్ పాషాతో పాటుగా ఆర్‌పిఎఫ్ సిబ్బంది విస్తృతంగా సోదాలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లోని పార్సిల్ కౌంటర్ వద్ద 199 కాటన్ బాక్సుల్లో తరలింపు సిద్ధంగా ఉంచిన రూ.5,20,380 విలువైన టేబుల్ ఫ్యాన్లను గుర్తించారు. వెంటనే ఆగాపుర వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సరైన పత్రాలు లేని కారణంగా వాటిని సీజ్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బీజేపీ విజయానికి కృషి చేస్తా'

గోల్కొండ: హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం క్యాంపెన్ విభాగం ఇన్‌చార్జిగా నియమితులైన సీనియర్ బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి తెలంగాణలో ఆదరణ బాగా పెరిగిందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ పాలనను, విధానాలను మెచ్చుకుంటున్నారన్నారు. అధిష్ఠానం సూచనలు పాటిస్తూ పార్టీ అభ్యర్థి విజయానికి కృషిచేస్తానని ఆయన అన్నారు.

నిరుపేదలకు వరం జకాత్

ఇస్లాం ఐదు మూల సిద్ధాంతాల్లో జకాత్ ఒకటి

- వ్యాపారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జకాత్ ద్వారా పేదలకు ఆపన్నహస్తం



నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: రంజాన్ మాసం ప్రారంభం అయిందంటే బస్తీలు, కాలనీల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. నిరుపేదలు, ఏ ఆసరా లేని దివ్యాంగులు, వృద్ధులు సైతం రంజాన్ మాసం వచ్చిందంటే ఎంతగానో సంబరపడతారు. రంజాన్ మాసంలో నిరుపేదలకు విరివిగా దానధర్మాలు చేయాలని దివ్య ఖురాన్ గ్రంథం స్పష్టం చేస్తుంది. ఇస్లాం ఐదు మూల సిద్ధాంతాల్లో జకాత్ ఒకటి. ఓ స్థాయి దాటి డబ్బులు, ఆదాయం, ఉన్న ప్రతి ముస్లింపై జకాత్ తప్పనిసరి అవుతుంది. తమ డబ్బులో నుంచి ఇస్లాం మత సూత్రాలను నిర్దేశించే విధంగా 2.5 శాతం జకాత్ రూపంగా తీయాలి. ఈ విధంగా తీసిన డబ్బును నిరుపేదలు, దివ్యాంగులకు ఇవ్వాలి. ఈ విధంగా తీసిన జకాత్ డబ్బులను నగదు లేదా ఆ నగదు ద్వారా నిత్యావసరాలు, దుస్తులను అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలి. నిరుపేదల కోసం పని చేసే స్వచ్ఛంద సేవా సంస్థలకు సైతం జకాత్ డబ్బులను విరాళంగా ఇవ్వవచ్చు. టోలిచౌకికి చెందిన హ్యూమన్ కేర్, గోల్కొండకు చెందిన గోల్కొండ యూత్ అసోసియేషన్, టోలిచౌకికి చెందిన తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ వారు తమ సభ్యుల ద్వారా సేకరించిన జకాత్‌ను నిరుపేదలకు పంచిపెడుతున్నారు.

జకాత్ ఏ విధంగా లెక్కకడతారు..

- ఒక వ్యక్తి తాను న్యాయబద్ధంగా సంపాదించిన డబ్బు నుంచి కొంత భాగం జకాత్‌కు ఇవ్వాలి.
- ఏడున్నర తులాల బంగారం లేదా 52 తులాల వెండి ఈ రెండిటికి సమానమైన డబ్బు ఉన్న వారు ప్రతి యేదాది వాటి విలువపై రెండున్నర శాతం జకాత్‌కు కేటాయించాలి.
- స్థిరాస్తిలో వచ్చే ఆదాయంలో ఏమైనా మిగులు ఉంటే దానికి కూడా జకాత్ వర్తిస్తుంది.
- ఒక వేళ రంజాన్ మాసంలోనే బంగారం లేదా వెండి కొంటే ఆ బంగారం, వెండికి ఈ జకాత్ వర్తించదు. బంగారు ఆభరణాలు తూకం వేయడంలో, స్థిరాస్తులపై ఉన్న నగదు ఆదాయం లెక్కింపులో పారదర్శకత ఉండాలి.
- అదే విధంగా జకాత్‌కు అర్హులైన వారిని గుర్తించడంలో సైతం ఎటువంటి బేధభావం, పక్షపాతం ఉండకూడదు.
- దివ్యాంగులు, నిరుపేదలతో పాటు జకాత్ ఇచ్చే వారి బంధువులు ఎవరైనా జకాత్ అర్హులైతే ముందుకు వారికి జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి.
- ఈ జకాత్‌ను రంజాన్ నెలలో ఎప్పుడైనా ఇవ్వవచ్చు.
- జకాత్ ఇవ్వడంలో దర్పం గానీ, పెద్దరికం గానీ చూపించకుండా హుందాగా వ్యవహరించాలని ఇస్లాం సిద్ధాంతాల్లో స్పష్టంగా ఉంది.
- ఏదేమైనా రంజాన్ మాసం వచ్చిందంటే ముఖ్యంగా దివ్యాంగులు, పేదలు, అనాథలలో ఒక ఆశాకిరణం కనపడుతుంది.

జకాత్ ఇవ్వడం తప్పనిసరి..



బంగారు, వెండి ఆభరణాలు ప్రతినెలా క్రమం తప్పకుండా ఆదాయం ఉన్న వారికి జకాత్ వర్తిస్తుంది. ఇటువంటి వారు డబ్బు గురించి ఆలోచించకుండా తమ ఆభరణాలను తూకం వేయించి జకాత్ డబ్బులను నిర్ణయించి పేదలకు పంచిపెట్టాలి. ఆదాయ వనరులు, బంగారు వెండి ఆభరణాలు ఉన్న వారు జకాత్ ఇవ్వకపోతే దేవుడి దృష్టిలో వారు దోషులుగా నిలబడాల్సి వస్తుంది. – మౌలానా సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ, ఆల్ ఇండియా సీరత్ కమిటీ అధ్యక్షుడు

కేడర్‌ను బట్టి పే స్కేల్స్ ఇవ్వండి

పీఆర్సీ కమిటీని కోరిన ఆర్థికశాఖ అధికారులు



ప్రతిపాదన ప్రతిని అందజేస్తున్న మొహియుద్దీన్

నాంపల్లి: తెలంగాణ రెండవ పీఆర్సీ వివిధ ప్రధాన శాఖల అధికారిక సంఘాల ప్రతినిధులతో బుధవారం నుంచి చర్చించడం ప్రారంభమైంది. అందులో భాగంగా మొదటగా తెలంగాణ ఆర్థిక శాఖ అధికారులైన డీఏఓల సంఘంతో చర్చించడం ప్రారంభమైంది. పని ఒత్తిడి, జాబ్‌చార్ట్, ఇతర ఆర్థిక, ఇంజినీరింగ్ సమాన కేడర్‌లతో బేరీజు వేసుకుని తమ కేడర్ స్కేళ్ల ప్రతిపాదించాలని డీఏఓ సంఘం ప్రతిపాదించింది. రాష్ట్ర కేడర్‌లో ఉన్న తమ పోస్టును మల్టీజోన్ కేడర్‌కు దించి 317 జీ.ఓకు తమను బలిచేశారని, సుమారుగా 200 మంది ఇబ్బందుల పాలయ్యారని, అందుకే తిరిగి తమను స్టేట్ కేడర్‌లోకి మార్చేలా సిఫారసు చేయాలని విన్నవించారు. కమీషన్‌కు మొత్తం ఆర్థికపరమైన 11 సూచనలు, సర్వీసుపరమైన 9 సూచనలు ప్రతిపాదించామని సంఘం అధ్యక్షుడు మొహియుద్దీన్, కార్యదర్శి రాధా రమణారెడ్డి తెలిపారు. మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారి పీఆర్సీ ఛైర్మన్ శివ శంకర్ అధ్యక్షతన రెండవ సభ్యులు రామయ్యలను కలిసినట్లు వివరించారు. డీఏఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహియుద్దీన్ నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి రాధా రమణారెడ్డి, కోశాధికారి హాషం, కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, ఉషారాణి చర్చలో పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలతో మేధస్సుకు పదును



గోల్కొండ: పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన యాత్రలు వారి మేధస్సుకు పదును పెడతాయని వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. బుధవారం టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా ఇంజాపూర్‌లోని మస్కతీమిల్క్ ప్రాడక్ట్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. మహ్మద్ హిదాయత్ అలీఖాన్ ప్రతియేటా తాము విద్యార్థులకు విజ్ఞాన వినోద విహార యాత్రలకు తీసుకెళ్తామన్నారు.

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలు ప్రదానం



నాంపల్లి: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేషమైన సేవలందించిన 23 మంది సాహితీ ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022వ సంవత్సరానికి గాను కీర్తి పురస్కారాలను ప్రదానం చేసింది. బుధవారం వర్సిటీ ఆడిటోరియంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పురస్కార గ్రహీతల్ని సత్కరించి అభినందించారు. సన్మానితులు ఒక్కొక్కరికి రూ.5,116 నగదు, జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రపంచీకరణ విధానాల వలన భారతీయ భాషలు 40 శాతం అంతరించిపోతున్నాయని, తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

పురస్కారాలు అందుకున్న వారిలో హరిదాసు(ఆధ్యాత్మిక సాహిత్యం), ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి(ప్రాచీన సాహిత్యం), దాట్ల దేవదానం రాజు(సృజనాత్మక సాహిత్యం), జాలాది రత్న సుధీర్(కాల్పనిక సాహిత్యం), డాక్టర్ జి.వి.రత్నాకర్(అనువాద సాహిత్యం), డాక్టర్ గుర్రం సీతారాములు(అనువాదం) తదితరులున్నారు.

నియామకం



మామిడి కృష్ణ కుమార్

గౌలిపురా: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్‌గా మామిడి కృష్ణ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బెల్లరపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్‌కు ప్రత్యేక ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 16 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే నూతనంగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లకు పాలక మండలి వేసి బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. మా రాష్ట్ర కార్యవర్గ పెద్దల ఆదేశాల మేరకు ఫెడరేషన్ డిమాండ్లకు అనుకూలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

కేన్సర్ నివారణకు రసాయన శాస్త్రవేత్తల పాత్ర కీలకం



మాట్లాడుతున్న గౌరవ అతిథి ఐఐసిటి శాస్త్రవేత్త డా.లింగయ్య



ప్రసంగిస్తున్న రసాయన శాస్త్రవేత్త డా.శ్రీనివాసా చారి

చార్మినార్: కేన్సర్ నివారణకు రసాయన శాస్త్రవేత్తల కృషి కీలకమని స్విట్జర్లాండ్ శాస్త్ర వేత్త డాక్టర్ ఎస్. శ్రీనివాసాచారి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి సౌజన్యంతో ఎమర్జింగ్ ఇంటర్ డిసిప్లినరీ హొరైజాన్స్ ఇన్ కెమికల్ సైన్సెస్ అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. శ్రీనివాసా చారి మాట్లాడారు. నాణ్యమైన రసాయన శాస్త్ర పరిశోధనలతో విశ్వంలోనే సాటిలేని మేటి భారతదేశాన్ని నిర్మించడంలో విద్యావేత్తలు, మేధావులు కీలకమైన పాత్ర పోషించాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన హైదరాబాద్ ఐఐసిటి శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లింగయ్య మాట్లాడుతూ..ప్రమాదకరమైన పర్యావరణ సంక్షోభాన్ని నివారించే దిశగా వైజ్ఞానిక శాస్త్రాల పరిశోధన సాగాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. వర్తమాన వాణిజ్య రంగ అవసరాలకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పద్ధతులను అనుసరించి, రసాయన శాస్త్ర పాఠ్య ప్రణాళికను రూపొందించుకోవాలని వివరించారు. రెండు రోజుల సదస్సులో ప్రత్యక్షంగా, పరోక్షంగా పత్ర సమర్పణ చేసిన ఆచార్యులకు ముఖ్యఅతిథి డా.శ్రీనివాసా చారి ధ్రువ పత్రాలను ప్రదానం చేశారు. సదస్సు సంచాలకులు డా.ఏలూరి యాదయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్ల, కేరళ కేంద్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు డా.శివ కుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు హరి పద్మ శ్రీ, సోమేశ్వర్, వరంగల్ ఎన్ ఐ.టీ ఆచార్యులు డా.కాశీనాథ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వలంటీర్లకు అవార్డుల ప్రదానం



అవార్డులను అందజేస్తున్న అరుణ్ డేనియల్

అబిడ్స్: వలంటీర్లలో తమ ప్రతిభను చాటేందుకు, స్నేహం, ప్రేమ భావాలను పెంపొందించేందుకు తమ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని యంగిస్తాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అరుణ్ డేనియల్ ఎల్లమటి అన్నారు. తమ ఫౌండేషన్ యువతను ప్రోత్సహించడంతో పాటు వారి ఉన్నతికి, వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. బుధవారం ఫౌండేషన్ వలంటీర్లలో అత్యుత్తమైన పలు రకాల అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..వలంటీర్లు కూడా తమ ఫౌండేషన్‌కు పునాదిలాంటి వారన్నారు. 2014లో ప్రారంభమైన యంగిస్తాన్ ఫౌండేషన్ దాదాపు 70 వేల మంది యువకులకు ఎన్నో విధాల సహాయ సహకారాలు అందించిందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా కృషి



మోతీదర్వాజా వద్ద డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. డ్రైనేజీ పొంగిపొర్లడంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అయితే ఆయా పనులపై శ్రద్ధ కనబరచాలని తాను జలమండలి అధికారులను కోరడం జరిగిందన్నారు. పూడికతీత పనులకు కూలీలను కాకుండా సిల్ట్ క్లీనింగ్ మెషీన్‌లను వాడాలని తాను సూచించాన్నారు. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్‌లు ధ్వంసమై రోడ్డుపై మురుగు పారుతుందని ఆ ప్రాంతంలో కొత్త పైప్‌లైన్‌లు వేసి కొత్త మ్యాన్‌హోల్ మూతలు వేయాలని తాను ఆదేశించాన్నారు. రంజాన్ మాసం అయినందు వల్ల మసీదుల పరిసరాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. అనంతరం మోతీదర్వాజా, హీరాఖానా తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ లైన్‌ల మరమ్మతులు, డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలించారు. ఆయన వెంట నానల్ నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హబీబ్ చౌస్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

దూద్‌బౌలి: సైబర్ నేరాల నిర్మూలనలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని పురానాపూల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అఫ్జల్‌గంజ్ ప్రధానోపాధ్యాయురాలు పి.ఎల్.పద్మజా కుమారి అన్నారు. బుధవారం పాఠశాల విద్యార్థులు పురానాపూల్‌లోని బస్తీలలో సైబర్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ విద్యా శాఖ క్యాప్, స్వచ్ఛంద సంస్థ, షీ టీం సంయుక్త ఆధ్వర్యంలో ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు సైబర్ అంబాసిడర్ అంటూ ఆన్‌లైన్ శిక్షణను ఇస్తున్నారు. ఇందులో భాగంగా సైబర్ నేరాలపై అవగాహనను కలిగించారు. ఉపాధ్యాయులు సుచరిత, అశోక్ బాబు, ప్రద్యుమ్న రెడ్డి, బల్వంత్ రెడ్డి, డాక్టర్.ఎస్.విజయ భాస్కర్, శ్రీనివాస్, బబిత, కౌసర్ ఫాతిమా పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య



సంతోష్‌నగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..హఫీజ్‌బాబానగర్‌కు చెందిన ఫాతిమా బేగం, మహ్మద్ ఫెరోజ్ ఖాన్ (36)లు దంపతులు. ఫెరోజ్ ఖాన్ కారు డ్రైవర్. ఇటీవల ఫాతిమా బేగం తన సోదరి ఆరోగ్యం బాగలేకపోవడంతో శంషాబాద్‌కు వెళ్లింది. సోదరి దగ్గరికి వెళ్లేముందు భర్త ఫెరోజ్ ఖాన్‌తో గొడవ పడింది. ఈనెల 17న ఫెరోజ్ ఖాన్ ఫోన్ చేసి తన మేనమామ చనిపోయాడని..అంత్యక్రియలకు వెళ్దామని భార్యకు తెలిపాడు. ఆరోగ్య సమస్య కారణంగా రాలేనని తెలిపింది. ఈనెల 19న సాయంత్రం 6 గంటలకు ఫెరోజ్ ఖాన్ మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడటంతో ఆమె కోడలు నుస్రత్ బేగం ఫాతిమా బేగంకు సమాచారం అందించింది. ఫాతిమా బేగం తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటికి చేరుకుంది. సమాచారం అందుకున్న కంచన్‌బాగ్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు కూలీలకు గాయాలు

జియాగూడ: సెంట్రింగ్ వర్క్ చేస్తున్న సమయంలో 3 ఫేస్ విద్యుత్ తీగలకు ఐరన్ సీకులు తగిలి ఇద్దరు కూలీలు తీవ్ర గాయాలపాలై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం..పురానాపూల్ కూలీల అడ్డపై ఉన్న జార్ఖండా గోదా డిస్ట్రిక్‌కు చెందిన అబుబాకర్ అన్సారీ (21) వృత్తిరీత్యా దినసరి కూలి. మరో వ్యక్తి జుమ్మేరాత్ బజార్‌కు చెందిన మహ్మద్ ఇస్రాఫిల్ అన్సారి(42) దినసరి కూలి. మంగళవారం ఉదయం ఆశన్న కాంట్రాక్టర్ వీరిద్దరిని జియాగూడలోని సాయిదుర్గా నగర్‌లో రమేష్ ఇంటి 2వ అంతస్థుపై కూలీపని ఇచ్చాడు. సాయంత్రం వేళల్లో ఇనుప సీకులను ఇంటి రెండవ అంతస్థుకు తరలిస్తున్న సందర్భంలో 3 ఫేస్ విద్యుత్ తీగలు సీకులకు తగలడంతో ఇద్దరు కూలీలకు విద్యుత్ షాక్ తగిలి కింద పడ్డారు. వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

29న టీ-హబ్‌లో నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డ్స్



లోగోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: మాదాపూర్‌లోని టీ-హబ్‌లో ఈనెల 29న 'నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డ్స్' ప్రదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్యాక్స్ ఫైలింగ్ ఫౌండర్ ఇండియా కంపెనీ ఫౌండర్, సీఈఓ చల్లూరి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో కార్యక్రమం లోగోను ప్రపంచ పర్యావరణ సంస్థ ఫౌండర్ అధ్యక్షులు డాక్టర్ సీహెచ్ భద్రతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వ్యాపార రంగాల్లో యువతకు మెళకువలు నేర్పిస్తూ వారి ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారవేత్తలు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ అవార్డుల కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ఎంపీ ఆర్.కృష్ణయ్య, మూడు రాష్ట్రాల ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు హాజరవుతారన్నారు. సుమారు 300 నామినేషన్స్ వచ్చాయని తెలిపారు. అలాగే త్వరలో లండన్‌లో కూడా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నేషనల్ ఓబీసీ నేత రాంప్రకాష్ మాలి, ఎంబీసీ నేత ప్రదీప్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సాయికుమార్



అబిడ్స్: మత్స్యశాఖ సహకార సంఘాల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన మెట్టు సాయికుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బుధవారం సీఎంను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ..చిన్న వయస్సుల్లో తనను చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పదేళ్లుగా మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై నిరంతర ఆందోళనలు చేసిన తనకు పార్టీ సముచిత స్థానం కల్పించిందని కృతజ్ఞతలు తెలిపారు.

ఇఫ్తార్ విందు



చార్మినార్: రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. మాజీ కార్పొరేటర్ మోహాసిన్ బలాల పంజేషాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోదీ ప్రభుత్వం నట్టేట ముంచింది'



గౌరీ సతీష్

అబిడ్స్: నిరుద్యోగులను దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నట్టేటముంచిందని రాష్ట్ర పీసీసీ అధికార ప్రతనిధి గౌరి సతీష్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం దేశంలో కోటి ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటనలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..ఈ ఎన్నికల్లో తెలంగాణతో పాటు దేశ నలుమూలలా యువకులు, నిరుద్యోగులు, మహిళలు మోదీ ప్రభుత్వంపై కసితో ఉన్నారన్నారు. కేవలం వంద రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్ల విశ్వాసం, నమ్మకం మరింత పెరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పే అసత్య ప్రకటనలు, ప్రచారాలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని గౌరీ సతీష్ అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే దేశంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ప్రగతి కొనసాగుతుందన్నారు.

కాంగ్రెస్‌లోకి గొంటి విక్రమ్‌యాదవ్

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి చిన్నారెడ్డి సమక్షంలో గొంటి విక్రమ్‌యాదవ్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విక్రమ్ యాదవ్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు గెలుచుకునేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.



రాణి అవంతిబాయికి ఘన నివాళి



అబిడ్స్: స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి అవంతిబాయి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ధూల్‌పేట్‌లోని ఆమె విగ్రహానికి గోషామహల్ బీజేవైఎం కన్వీనర్ సోమ్‌రాజ్ సింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్‌తో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశం కోసం ప్రాణాలర్పించిన వీర వనిత రాణి అవంతిబాయి అని కొనియాడారు.

సత్కారం

గౌలిపురా: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాతబస్తీ గౌలిపురా రోజరీ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని కూచిపూడి కళాకారిణి కుమారి బుజ్జి పరిణీతను బుధవారం మాజీ మంత్రి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షురాలు కొండు పుష్పలీల, ఈటల జమున, కార్పొరేటర్ డాక్టర్ సురేఖలు మెమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.



ఫర్నిచర్ అందజేత



అనాథ పిల్లలకు ఫర్నిచర్, ఇతర సామగ్రిని అందించిన దృశ్యం

అబిడ్స్: సమాజ సేవలో వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ముందంజలో ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వరకుమార్ గుప్తా, మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ నాచం పేర్కొన్నారు. నిరంతరం హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో సమాజసేవ చేసేందుకు విశేషంగా కృషి చేస్తుందన్నారు. బుధవారం జీబీపీఎస్ అనాథ పిల్లలకు ఫర్నిచర్, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తమ క్లబ్ దాదాపు 50 సంవత్సరాలుగా సమాజ సేవకే అంకితమైందన్నారు. అనాథ పిల్లలతో పాటు పేద విద్యార్థులకు అండగా ఉండి వారి సంక్షేమానికి, వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాచ్చ సతీష్, మంచాల అంబరీష్, అడుగుల వెంకట్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.